# దెయ్యాలతో ఒక రాత్రి

శ్రీ ఇసుకపల్లి దక్షిణామూర్తి

వెంకటరావుకీ నాకూ చాలా కాలంనుంచి స్నేహం. ఎర్రగా పొడుగ్గా ఉంటాడు. చక్కగా దిద్దిన క్రాఫింగు. చలాకీ కళ్ళు. ఎత్తైన చెక్కిళ్ళు. చేతులు ఒక వరస పైకి మడిచిన బుష్ షర్టు వేసి పై రెండు గుండీలు వదిలేస్తాడు.

మొన్నీమధ్య ఏవో బట్టలు కొనుక్కుని దుకాణంలో నుంచి బయటకు వస్తుండేటప్పటికి ఎదురయ్యాడు. అతన్ని కలిసి నెల రోజులు దాటిందో ఏమో వాడిని చూడగానే నాకు సంతోషం వేసింది.

"నీ దుంప తెగ...కనపడటం మానేశావేమిటి.." అని అడిగాను.

"ఎక్కడ కనబడేదిరా నాన్నా...క్షణం తీరిక ఉండటం లేదు" అన్నాడు.

"అంత ఏం ముంచుకు వచ్చిందిరా..."

"సరే...నీతో చెప్పనేలేదు కాబోలు...సూపర్నెంటు పనయిందిగా ఇప్పుడు ."

"ఎక్కడ..."

"ఊరు బయట బంగళా ఒకటి ఉంది.. దాన్లో..." బంగళాలో సూపరెంటు పనేమిటో నా కర్థం కాలేదు.

"ఏ తలమాసినవాడురా నీకు ఉద్యోగం ఇచ్చింది."

"నీకు చెపితే అర్థంకాదు గాని...కారు పంపుతాను... రేపు వచ్చేయి ..నీకే తెలుస్తుంది. "

నాకు భలే ఆశ్చర్యం వేసింది. మొన్న మొన్నటిదాకా బస్సు డబ్బులకోసం నన్ను చిల్లర అడిగినవాడు నాకు కారు పంపటం అంటే నమ్మేట్లుగా కనిపించలేదు.

"ఈ హోదా అంతా ఏమిటి నాకు ముందుగా ఒక్కముక్కన్నా చెప్పలేదు..." అన్నాను.

"ఒరేయి నాన్నా...నువ్వు సొద పెట్టకుండా కారులో వచ్చేసెయ్యి. ముందర చెప్పేస్తే గ్లామరుండదు.." అన్నాడు.

"మా ఇల్లు గుర్తుందా .."

"నిక్షేపంగా ."

మర్నాడు పొద్దున్నే లేచి టాయిలెటు అయి ఒకటి ఆరా తెల్లవెంట్రుకలుంటే పీకేసి, ఇస్త్రీ చొక్కా లాగూ బయటకు తీశాను. సైకిలుమీద అంటే బనీను, పైజామాతో పోయినా ఫరవాలేదు. ఎవరూ పట్టించుకోరు. కారుమీద పోవడం అంటే అందుకు తగిన వేషం వుండాలనిపించింది.

కారుతోపాటు వానకూడా బయలుదేరింది సన్నగా. ఆకాశంలో మేఘాలు పోటీపడి పరుగులెత్తుతున్నాయి. వాన తుంపరలుపడి కారు అద్దాలమీదపడి నీళ్ళచుక్కలు జారుతున్నాయి.

"ఇల్లు కనుక్కోవటం కష్టమయిందా..." కాలక్షేపం కోసం డ్రైవరుని పలకరించాను.

"లేదండి .."

"బంగళా ఎంతదూరం.. !"

"అయిదు మైళ్ళు .."

చల్లగాలి వీస్తోంది. వాన కురుస్తున్నా పసుపుపచ్చటి ఎండ గోడలమీద పడుతోంది. తడిసిన నేలమీద మబ్బుల నీడలు మెల్లిగా నడిచిపోతున్నాయి. వాన తుంపరలు తెగిన దారపు ముక్కల్లాగా పడుతున్నాయి. ఉండిఉండి చప్పుడు చెయ్యకుండా పెద్ద మెరుపు రావటం కొంచెం సేపటికి ఉరమటం. మెరిసినప్పుడు వెయ్యి దివిటీలు ఒక్కసారి వెలిగించిన కాంతి వస్తోంది.

కారు ఊరు బయటకు వచ్చింది. నేల తడిసిన వాసన కమ్మగా వస్తోంది. ఆ కారు, ఆ ఇస్త్రీబట్టలూ లేకపోతే అక్కడ పొలంలోకి పోయి వానలో తడుస్తూ, కమ్మని వాసన ఆఘ్రాణిస్తూ వెల్లకిలా నేలమీద పడుకుందా మనిపిస్తుంది. తల్లి ఒళ్ళో పడుకున్న పిల్లాడి సౌఖ్యం ఎంతని చెప్పగలం? అంత ఆనందం పొలాల్లో పడుకోవడం అంటే.

కొద్ది సేపట్లోనే కారు ఓ పెద్దగేటు ముందర ఆగింది.

వెంకటరావు వచ్చాడు.

బంట్రోతుల్లా ఉన్నారు - ఇద్దరు వచ్చారు. డ్రైవరు తలుపుతీసి నిలబడ్డాడు.

కారుదిగి లోపలకు దారితీశాం.

అంతా ఆకుపచ్చ తివాసీలుపరిచినట్లు గడ్డి దుబ్బుగా

మెత్తగా పెరిగింది. అన్నీ పూలు. ఎర్రటివి. పసుపువి - నీలాలు.

మెట్లపక్కన మళ్లలో చిన్న చిన్న పోకచెట్లు.

మెట్లు చాలా ఉన్నాయి. అన్నీ ఎక్కి హాలులోకి వెళ్ళాం. టేబులుమీద ఫలహారాలున్నాయి. గోడలు నాలుగైదు నిలువల ఎత్తున్నాయి. పైన రకరకాల డిజైనులు. దీపాలు పెట్టే గాజుకుండీ. పాలరాయి నగిషీ. కుర్చీలో కూర్చున్నా. మెత్తగా ఉంది.

“ఇంకొక ప్రశ్నఅన్నా వెయ్యరా...” అన్నాడు వెంకటరావు. టిఫిను నోరూరుస్తోంది. “తింటూ మాట్లాడుదాం..” అన్నాను. వాడు ఊరికే నవ్వటం మొదలుపెట్టాడు. గోడలు తిరిగి నవ్వుతున్నాయి. కొంత దూరం పోయి తోటలోనుంచి నవ్వు తిరిగి వస్తోంది.

“ఆ కొండ చూశావా ..అదే గోల్కొండ.” అన్నాడు వెంకటరావు. వాన అక్కడ వెలిసింది గాని, దూరాన తగ్గినట్లు లేదు. వాన తుంపరల్లోనుంచి గోల్కొండ మసక మసగ్గా కనిపిస్తోంది.

టిఫిను తిని మేడమీదకు పోయాం. అక్కడనుంచి హైదరాబాదు అంతా కనిపిస్తోంది. చార్మినార్ శిఖరాలు, ఉస్మానియా ఆసుపత్రి, మేడచుట్టూ తోట బాగా కనిపిస్తోంది. కింద ఎన్ని పూల మొక్కలు, రంగు రంగులు, పెద్ద పెద్ద చెట్లు, ఒక చోట ఫౌంటెను ఉంది. నీళ్ళు గిరగిరా తిరుగుతూ పైకి ఎగురుతున్నాయి. కోనేరులాగా ఉంది ఒక చోట - స్నానాలు చేయటానికి కాబోలు. తామర తూడులన్నీ ఎండిపోయాయి. ఒక్క పువ్వు మటుకు సగందాకా విచ్చి అక్కడ ఆగిపోయి ఉంది.

వెంకటరావు ముందు నడుస్తున్నాడు. బూటు లేసు ఊడిపోతే కట్టుకుని బయలుదేరేటప్పటికి రెండు నిమిషాలు ఆలస్యం అయింది నాకు. మళ్ళీ బయలుదేరి గబగబా అడుగులు వేస్తుండేటప్పటికి ఎవరో ఎదురయింది. పని మనిషిలాగా ఉంది. చాలామంది నౌకర్లున్నారే అనుకుంటుండేలోపుకి ఆ మనిషి నా వంకచూసి నవ్వింది అసహ్యంగా. కొంచెం తెల్లబోయాను. ఆమె నవ్వుతుంటే తెల్లని పళ్ళన్నీ బయటపడ్డాయి. బుగ్గలు కొంచెం సొట్టలు పడ్డాయి. ముఖం మీదికి జారిన ముంగురులు ఆమె నవ్వుని చేతనయినంతవరకు దాచేస్తున్నాయి. కళ్లు మటుకు గాజు గుళ్లలాగా ఉన్నాయి తెల్లగా. మధ్య పేలవంగా ఉన్న నల్లటి కనుపాప ఎడారిలో ఒంటరిగా కూర్చున్నట్లుంది. నా వంటి అపరిచితుణ్ణి చూసి 'అలా' నవ్వటం చికాకు కలిగించింది. ఎవరన్నా చూస్తే? ఆమెను చూడనట్లుగా ముందుకు వెళ్ళిపోయాను. ఆమె నవ్వు బయటపడింది. తెరలు తెరలుగా వచ్చింది. సముద్రపు అలలు చెలియలి కట్టమీదకు వచ్చి తిరిగి పడిపోతున్నట్లు ఆ నవ్వు తెరలు నా దాకా వచ్చి ఆగిపోతున్నాయి. నా వెంబడి వస్తున్నదేమోనని భయం వేసింది. వెనక్కు తిరిగి చూడటానికి ధైర్యం కలగక గబగబా అడుగులు వేశాను.

వెంకటరావు మలుపులో కలిశాడు.

“అట్లా నవ్వుతుం దెందుకు..?” అని అడిగాను. నా వంక తమాషాగా చూశాడు. కళ్లు తళుక్కు మన్నాయి. “పిచ్చి దేమిటి?” అన్నా. వెంకటరావు నవ్వబోయి ఊరుకున్నాడు. మా వెంకటరావుని కదిలిస్తే ఒక గొడవ ఉంది. పెంకులు ఎగిరేటట్లు నవ్వటం మొదలుపెడతాడు. మళ్ళీ ఆ మనిషి సంగతి ఎత్తవద్దనుకున్నాను.

తోట అంతా తిరిగాం. ఒక చోట పెద్ద సంపంగి చెట్టుంది. వాసన గుబాళిస్తున్నది గాని, పూవు మాత్రం కనబడటం లేదు. కలయ చూశాను. మాలి అంతా గాలించి కోసి ఇచ్చాడు.

చాలా పెద్ద పువ్వు.

రేకులు అందమైన ఆడదాని పెదిమల్లా ఉన్నాయి. పూవు వాసన చూస్తుంటే ఒక రేకు పెదిమకు తగిలింది.

వెంకట్రావు చూస్తున్నాడు నా వంక.

మాలి చూస్తున్నాడు.

పిచ్చిది మేడమీదనుంచి చూస్తోంది.

పువ్వు తీసి జేబులో వేసుకున్నాను.

“రోజూ ఒక పువ్వు పూస్తుంది...” అన్నాడు మాలి. ఎర్రటి తలపాగా, బనీను, తొడలపైదాకా కట్టిన ధోతీ, శరీరం నల్లనిదే అయినా, సాల గ్రామంలా మెరుస్తోంది. నాకు ఇష్టమయితే నవ్వుదామన్నట్లు, ఒకటి రెండు సార్లు నవ్వటానికి ప్రయత్నించాడు.

“అప్పుడు కోడె తాచు రాలేదండి..” మాలి ఏదో చెప్పబోయాడు. వెంకట్రావు మాట మధ్యలోనే అందుకున్నాడు.

“ఆ రోజు ఉండాల్సిందిరా నువ్వు.. ...ఎంత పెద్ద పామనుకున్నావు...నా బారెడుకంటే జానెడు ఎక్కువే ఉంటుంది . ఏరా మాలీ..”

“అవునయ్యా...ఎప్పుడూ సంపంగి చెట్టు చుట్టూ తిరుగుతూంటుంది అయ్యగారూ...”

ఆ రోజు వాన కురుస్తునే ఉంది. ఒక్కసారి పెద్ద జల్లు వచ్చింది. వడగళ్లుగూడా పడ్డాయి. వేపపళ్ళంత ఉన్నాయి. మాలి వాటిని ఏరి గ్లాసులోనే వేసి తీసుకు వచ్చాడుగూడా...

తోట అంతా తెగ తిరిగాం.

బంగళాలో లెక్కలేనన్ని గదులు. పొడుగు, వెడల్పు, ఎత్తు . మామూలు గదులకు నాలుగురెట్లు.

ఒకచోట పియాను, పెద్ద నిలువుటద్దం.

ఒకటి రెండుచోట్ల బెంగుళూరు పెంకు పగిలిపోయింది. అందులోంచి ఎండ లోపలపడుతోంది. మబ్బుల నీడలు పడి పరుగెత్తుతున్నాయి.

నౌకర్లు, డ్రైవరు, కూలి.. కారు. వెంకట్రావు ఇష్ట ప్రకారం నడుచుకుంటాయి అన్నీ. వెంకట్రావు గది మేడ మీద మూలగా వుంది. తలుపుతీస్తే కొట్టుకుపోయేగాలి వస్తుంది.

మేడమీదనుంచి చూస్తే కోనేరులో స్నానం చేసే వాళ్ళు కనపడతారు. అటువైపు చూశాను. చుట్టూ కొబ్బరి చెట్లు. అన్నీ కోనేరువైపుకు వంగి వున్నాయి. ఎవరో స్నానం చేస్తున్నారు. తలకరకు కనబడుతోంది. బయటకు వస్తుందేమోనని కాసేపు చూశాను.

నిశ్శబ్దం గూడు కట్టుకుపోయిన ఆ గదుల్లో పిరికి గుండెలవాళ్ళుండలేరు.

సహారా ఎడారిలో ఒంటరిగా ఉన్నట్లుంది నాకు.

కారు భోజనం కారియరు తెచ్చింది.

కిళ్ళీలకోసం మళ్ళీ వెళ్ళివచ్చింది.

మధ్యాహ్నం పేకాట ఆడాం. కారమ్సు ఆడాం. కాఫీలు అయి చదరంగం తీశాం. రాజు కట్టు పరిస్థితి వచ్చేటప్పటికి పొద్దుకూకుతోంది.

బయట గలభాగా ఏవో మాటలు వినబడ్డాయి. గబ గబా బయటకు వచ్చాం. సంపెంగ చెట్టు వెనకాల మాలిని ఎవతో చెప్పుతో కొడుతోంది. అతను పెనుగు లాడుతున్నాడు. ఆమె అతన్ని భల్లూకంలా పట్టుకుంది. అతను పడిపోయాడు. మీద కూర్చుంది, అతని జుట్టుపట్టు కుని పీకుతోంది. అతని ముఖంమీద ముఖంపెట్టి ఏమిటో అరుస్తోంది. ఆమె పెదిమలు కనిపించినాయి. సంపెంగ పువ్వు రేకులు గుర్తుకు వచ్చినాయి. మాలి ఆమెను వది లించుకుని రొప్పుతూ వచ్చాడు. మమ్మల్ని చూడగానే అతని ముఖం నిర్జీవమైపోయింది.

"పోదాంరా " అంటూ వెంకటరావు నన్ను లోప లకు తీసుకుని పోయాడు.

చీకటి బాగానే పడింది. సప్త ఋషులు కనబడు తున్నారు. ధృవ నక్షత్రం మెరుస్తోంది. అరుంధతి కనబడీ కనబడకుండా ఉంది.

"అసలు సంగతి చెప్పరా బాబూ..." అన్నా...

"చూశావుగా పనులన్నీ...తోట అంతా బాగా చూడాలి పని మనుషుల్ని అజమాయిషీ చెయ్యాలి"

"వాళ్ళని పెట్టుకోవడం ఎందుకు.. "

"అజమాయిషీ చెయ్యటం ఎందుకు...?"

"భోజనం, బట్టలు .సాదరు ఖర్చుపోను . పైన వంద రూపాయలు ఇస్తారు.. "అన్నాడు.

మాలికి కొంచెం హుషారు వచ్చింది మళ్ళీ.

సారా వాసన వస్తోంది. వెంకటరావు ఒక సీసాతీసి ఖాళీచేశాడు. "నిన్ను బలవంతం చెయ్యనులే..." అన్నాడు.

"మీకు పెళ్ళయిందా బాబూ?" మాలి అడిగాడు. వాడి చొరవ ఎబ్బెట్టుగా ఉంది.

"ఏరా నీకు దయ్యాలంటే భయమా? " వెంకట రావు అడిగాడు. నా పిరికితనం వీళ్ళు చెప్పుకునే అవసరం లేదనుకున్నా.

"ఇక్కడ...మూడు, నాలుగు దయ్యాలున్నాయి బాబూ...ఒకటి మటుకు రోజూ వస్తుంది. " అన్నాడు మాలి.

దయ్యాల కథలు వినటం ఇష్టంలేదు నాకు. ముఖ్యంగా రాత్రి పడుకోబోయే వేళ.

"దాన్ని చూడాలి బాబూ...ఎంత అందంగా ఉంటుం దని..." అన్నాడు మాలి.

"నిజమే . "అన్నాడు వెంకట్రావు.

"పన్నెండు దాటాలి బాబూ అబ్బ!ఏం తెలుపు.. " అన్నాడు మాలి

"వెన్నెలతో చేసినట్లుగా ఉంటుం దనుకోరా . " అన్నాడు వెంకటరావు.

నాలో కుతూహలం కలిగింది. దయ్యాలున్నాయంటే నమ్మను. కాని, ఈ దయ్యాన్ని ఒకసారి చూడవచ్చును అనుకున్నా.

"ఒకరాత్రి సంపెంగచెట్టు దగ్గరకువచ్చి చూసేటప్ప టికి అయ్యగారూ! సంపెంగ పువ్వు కోస్తోంది . నన్ను చూసి గబగబా దిగి పారిపోయింది "

"దానికి సంపెంగ పూలంటే ఇష్టం!"

నాలో ఎందుకనో దడ వచ్చింది. నా జేబులో సంపెంగ పువ్వు కదులుతున్నట్లనిపించింది. ఉలిక్కిపడ్డాను.

"ఆ చెట్టుకి ఒక్క పువ్వు పూస్తుందన్నారు గాదూ.. " అన్నాను.

నా ముఖం చెమట బిందువులతో నిండిపోయింది. జేబులో సంపెంగపువ్వు తీసి చెట్టు మీద పెట్టివద్దామనిపిం చింది.

నౌకర్లు ఎక్కడో వున్నారు.

పిచ్చిది అక్కడలేదు. మాలి బనీను చిరిగిపోయి ఉంది. సంపెంగచెట్టు వెనకాల ఇందాక పిచ్చిది చింపింది. ఆడదానిచేతిలో ఓడిపోయిన మాలి ముఖంలో పరాజయం కనబడటం లేదు.

"ఆ ముసిలి దయ్యం ఉంది చూశారూ దానికి ఎప్పుడూ తిండి ఆశేనండి అయ్యగారూ...వచ్చిందంటే ఆ జామ చెట్టుమీదే ఉంటుంది" మాలి ఎంతో చొరవగా ఒక స్నేహితుణ్ణిగూర్చి చెప్పినట్లు చెపుతున్నాడు.

"నువ్వెప్పుడేన్నా చూశావా." మాలిని అడిగాను.

"భలేవారండీ ఇక్కడ నౌకరీ కుదిరిన తర్వాత ఇరవై సార్లన్నా చూసి ఉంటాను.." మాలి మాటల్లో అసత్యరూపం కనబడటం లేదు. అబద్ధం ఆడినా అట్లా ఉండాలి అనుకున్నా.

పిచ్చిది వరండా చివర పిట్ట గోడమీద కూర్చుని కనబడింది 'ఆడది ప్రత్యక్ష రాక్షసిరా నాయనా!' అంటుండే ఒక స్వాములవారు గుర్తుకు వచ్చారు.

గదిలో పడుకుంటే కిటికీలోనుంచి గోల్కొండ కోట కనపడుతోంది. రోడ్డుకి రెండు పక్కలా ఇద్దరు రాణుల కోసం నవాబు కట్టించిన భవంతులు కనిపించీ కనిపించకుండా ఉన్నాయి.

ఆ దారి వెంట ఏదన్నా కారు పోతుంటే దాని హెడ్‌లైటు వెలుతురులో ఒక్కొక్కసారి స్పష్టంగా కనబడుతున్నాయి.

సంపెంగ వాసన వెదజల్లుతోంది. పక్క గదిలోనుంచి మధుర సంగీతం వినవస్తోంది. రేడియో పెట్టారనుకున్నాను. బయటకు వచ్చి తొంగి చూచాను. అక్కడి నౌకర్లు చాకర్లు అంతా చేరారు. ముగ్గురు ఆడవాళ్ళు కూడా ఉన్నారు. ఒకత్తె నృత్యం చేస్తోంది. నృత్యం అంటే ఆ మాటకు అపచారమేమో! కాళ్లు, చేతులూ ఆడిస్తోంది. నడుము తిప్పుతోంది. పమిటలాగా చుట్టిన నీలిరంగు గుడ్డ జారిపోతుంటే ఒక్కోసారి తీసుకోవటం లేదు. మాలి లేచి పమిటకప్పి వచ్చి కూర్చుంటున్నాడు. ఏవో వెకిలి చేష్టలు చేస్తోంది.

తంబూరా వాయించే స్త్రీ తన్మయత్వం పొందింది. మధ్య మధ్య తూలి పడిపోతోంది. సన్నటి పెదిమలు ఎర్రగా మంట చివర వచ్చే నాలికల్లాగా ఉన్నాయి. ముక్కు కొనగా తేలి పెదిమలమీదికి వస్తున్నట్లు కనబడుతోంది. వెంకటరావు కనిపించలేదు నాకు. గది అంతా పూర్తిగా కనబడటం లేదు. ఒక పక్కగా ఉన్నాడేమో కూడా! మధ్యమధ్య మాలి లేచి గంతులు వేస్తున్నాడు.

వెంకట్రావు దగ్గరకు పోదామనుకున్నాను. అత్తరు, అగరు వత్తుల వాసన ఒత్తుగా, మత్తుగా వస్తోంది. అప్పుడే ఒక స్త్రీ గదిలోకి వచ్చింది. మధ్యాహ్నం సంపెంగచెట్టు దగ్గర కనబడింది ఈమే అనుకుంటాను.

తలుపువేసి గదిలో పడుకున్నాను. నిద్రపట్టటం లేదు. కొంచెం నిద్రపట్టి మళ్ళీ మెలకువ వచ్చినట్లనిపించింది. ఆ బంగళా నిద్రపోతోంది. తోట నిద్రపోతోంది. ఎక్కడా దీపాల్లేవు. లేచి గదిలో దీపం వెయ్యటానికి భయంవేసింది. ఒక మిణుగురు పురుగు గదిలో మంచం చుట్టూ రెండు సార్లు తిరిగి బయటకుపోయింది. దాని వెంటబడి బయటకు పారిపోదామనిపించింది.

గది తలుపు చప్పుడయింది. కిటికీకి తగిలించిన కర్టెను తెరచాపలాగా గాలి పోసుకుని ఉబ్బింది లోపలవైపుకు. మళ్ళీ మిణుగురు పురుగు వస్తుందేమోనని ఆశగా చూశాను. గడియారం చూసుకున్నాను. పన్నెండు అయింది. తలుపు ఈసారి ఎవరో కొడుతున్నారు. తలుపు తీసి చూశాను. ఎవరూ లేరు. నా పిరికితనమే నన్ను భయపెడుతోంది. లోపలకు వచ్చేద్దామనుకుంటుంటే సంపెంగ పూల వాసన గుప్పుమని ఉప్పెన కెరటంలో వచ్చి పడింది. ఒక రూపం కదిలివస్తోంది. దయ్యాలుండవని గట్టిగానే నమ్మినా ఉన్నప్పుడు చూడటానికి భయం ఎందుకు? అనుకున్నా. దూరం నుంచి వస్తున్న రూపం స్త్రీగా గమనించాను. కడిగిన పాలరాతి విగ్రహం కదిలి వస్తున్నట్లుగా ఉంది. వంటిమీద సన్నని మల్లు వస్త్రం రెపరెప లాడుతోంది. మధ్య మధ్య అడుగుల చప్పుడు నా గుండెలమీద వినబడుతోంది. దయ్యాలు లేవు. ఉంటే.. ధైర్యస్థులనుఏమీ చెయ్యవు అని నాకు తెలుసు. ధైర్యం ఎక్కడ దొరుకుతుంది. బజారులో దొరకదు.

ఆ రూపం దగ్గరగా వస్తోంది.

గదిలోపలకు పోయి తలుపు దగ్గరగా వేసి పడుకున్నాను. తలుపు చప్పుడయింది. తలుపు మెల్లిగా తోసుకున్నది. మంచంమీద లేచి కూర్చున్నాను. గదిలో లైటు లేదు. అదే రూపం. శేషశాయి పవ్వళించిన పాల సముద్రం గడ్డకట్టిపోయి పాల రాయిగా మారిపోతే అందులోనుంచి ఈవిగ్రహాన్ని తయారుచేసి వెన్నెట్లో కడిగి తెచ్చినట్లున్నారు. ఆమె వంటిమీద బట్టలన్నీ జారిపోయి నాయి. మ్యూజియంలో బట్టలేని పాలరాతి బొమ్మల్ని ఎన్ని చూడటం లేదు! అలాంటిదే ఇదీ అనుకున్నాను. ఈ బొమ్మ నడుస్తోంది. కళ్ళు కదిలిస్తోంది. మ్యూజియంలో బొమ్మలు కదిలిస్తే బాగుండును అని ఎన్నిసార్లో కలలు కన్నాను. ఆ పగటి కల నిశీథంలో నిజమే అయిందా!

మెల్లిగా నా దగ్గరకువచ్చి మంచం దగ్గర నిలబడింది. కళ్లు మిలమిలా నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. సూటిగా చూడలేకపోయాను. ప్రేమించి తృప్తిపొందకుండానే చాలా స్మరణాలకు గురియైనవాళ్ళు ఇలాగే ప్రేతరూపంలో తిరుగుతుంటారని నేనూ విన్నాను. మా రమణయ్య తాత వీటిని గురించి చెప్పేవాడు. తన దగ్గరకు వచ్చిందట ఒక భూతం. అప్పుడు కోరలను కున్నాను.

“ఎవరు నువ్వు ” ధైర్యం తెచ్చుకోవటానికి మాట్లాడాను.

నవ్వింది స్త్రీ మూర్తి. ఆ నవ్వు తెరలు తాళ్ళుగా వచ్చి అన్నివైపులా బంధించి వేసినాయి నన్ను. ఆమె చెయ్యి చల్లగా మంచులాగా తగిలింది. అలా తోచిందేమోగూడా! చెప్పలేను సరిగ్గా. పక్కన కూర్చుంది. టేబుల్లో సంపెంగ పువ్వు తీశాను. దాన్ని తీసుకుంది. వాసనచూసి, పెదిమలకు తగిలించుకుంది. వాటి రేకులు ఆమె పెదిమల్లో కలిసి పోయినాయి. లేచి బయలు దేరింది.

వచ్చినప్పుడు భయంవేసినా, వెళ్ళిపోతుంటే నామనసు ఆరాట పడింది. పువ్వు ఇవ్వటంలో పొరపాటు చేశాను అనుకున్నా. మంచంమీద అటూ ఇటూ దొర్లాను. నిద్ర పట్టటం లేదు. నిద్రపడితే తెలియడంలేదేమో! ఆ తోటంతా గాలించి ఆ ప్రేతంతో మాట్లాడాలని అనిపించింది. బయటకు వచ్చాను. ఎక్కడా కనబడలేదు. మెట్లు దిగి తోటలోకి పోవటానికి ధైర్యం చాలలేదు. వెనక్కి తిరుగుతుంటే ఇంకేదో రూపం పక్కగదిలో నుంచి రావటం కనిపించింది.

ఉత్సుకత నాలో కట్టలు తెంచుకుంది.

గదిలోకి పోయి కూర్చున్నా.

ఆమె తలుపు మెల్లిగా తోసి లోపలకు వచ్చింది. మసక చీకట్లో అస్పష్టంగానే కనబడుతోంది. పిచ్చిదిలాగా కనిపించింది. బట్టలు మంచివే కట్టింది. కనుసన్నల వెనక కైబరు కనుములు కనబడుతున్నాయి. నవ్వుతోంది. అదే నవ్వు. అసహ్యం వేసింది. ఆ దయ్యం తిరిగి వస్తుందేమోనని తలుపుతీసి ఉంచాను. ఇది వచ్చింది.

“ఏం కావాలి నీకు...”

సమాధానం రాలేదు. ఇందాకటి దయ్యం ఈరూపంలో వచ్చిందేమో! ఆమె నోరు తెరిచి ఏదో చెప్పబోయి ఆగింది. ఆమె నాలుక తాచుపాము పడగలాగా కనిపించింది. ఆమె శరీరం అంతా ఒక పాము పుట్టలాగా ఆమె కట్టుకున్న చీర పుట్టమీద ఆరేసినట్లుగా వుంది.

“ఎవరు నువ్వు . ఏంకావాలి.. ?” రెట్టించి అడిగాను. ఆమె దగ్గరకు వచ్చింది. నాకు నిజంగానే భయంవేసింది.

వాడిపోయిన లేత ఆరిటాకులా ఉంది ఆమె ముఖం. పిచ్చిది మంచం మీద పడుకుని వెకిలిగా నవ్వుతోంది. మంచంమీద నుంచి చేతులు పట్టుకుని కిందకు లాగేశాను. బయటకు పొమ్మని గద్దించాను. సినిమాలో విలనులాగా కనబడిందినాకు. అష్టోత్తరకరంగా వెకిలి చేష్టలు చేస్తోంది. ఆమెపై బట్ట జారిపోతోంది. బట్టలన్నీ తీసేస్తుందేమోనని భయంవేసింది.

“మాలీ .మాలీ.. !” అని పిలిచాను. బయట గాలి హోరు నవ్వుతున్నట్లు వినిపిస్తోంది. గదికి ఇంకోద్వారం లేదు. ఆమెను బయటకు ఎలా పంపాలో తోచలేదు.

గంట గడిచింది. ఇదంతా కలయితే బాగుండును అనిపించింది. “ఎవరు తలుపుతీసింది.. ” గదమాయించాను. ఆమె నాదగ్గరకు వచ్చింది.

వచ్చింది. తేలిపోతున్న కళ్లు. తూలిపోతున్న శరీరం. ఆమెను చూస్తే జాలివేసింది. ఆమె కళ్ళల్లోకి చూశాను. ఆమె మీదకుండా జీవితం నడిచిపోయింది.

“ఎవరునువ్వు...ఏమిటిదంతా.. ?” మళ్ళీ అడిగాను. నా మీదకు వాలిపోయింది. దయ్యంకాదని తోచింది. జుగుప్స వేసింది. నా చేతులు పట్టుకుని వదలలేదు ఆ స్త్రీ. ఆమెనుండి వదిలించుకోవటం కష్టమే అయేట్టుగా ఉంది.

ఆమె స్పర్శ తేళ్లూ జెర్రులూ తాకినట్లు ఉంది. ఆమె చేతుల్లో నా చొక్కా చిరిగిపోయింది. ఆమెను చెడామడా చేతికి వచ్చినట్లు కొట్టాను. ప్రత్యక్ష రాక్షసిలాగా కనబడింది. మితిమీరింది వ్యవహారం. ఆమె కలయబడుతున్న ధోరణిచూస్తే ధైర్యం కూడ గట్టుకోవలసిన అవసరం తోచింది. ఆమెను విదిలించాను. అయస్కాంతానికి అతుక్కొనే ఇనప ముక్కలాగా మీదకు వస్తోంది. ఆమె గొంతు పట్టుకున్నాను. ఆమె కెవ్వున కేక వేసింది.

ఆమె దెబ్బతిన్న సింహంలా నా మీదకు దూకింది. ఆమె చేతులు రెండూ పట్టుకుని గోడకు బలంగా నొక్కి పట్టాను. మాలి వచ్చాడు. మమ్మల్ని విడదీశాడు. సంపెంగ చెట్టుకింద మాలిని పిచ్చిది కొట్టటం గుర్తుకు వచ్చింది.

"మీద చెయ్యి వేశావంటే జాగ్రత్త..." అన్నాడు మాలి నా వంక చూస్తూ. కొయ్యలాగా ఉండిపోయింది శరీరం. ఎన్ని గుండెలు వాడికి! నన్ను ఆజ్ఞాపిస్తున్నాడు. మాలి వాడు. వాడి యజమానికి అతిథిని నేను. నిర్ఘాంత పోయాను. మంచంమీద కూలబడ్డాను. నల్లి కుట్టింది. ఒక్కసారి చైతన్యం కలిగినట్లయింది. పీడ కలగా తోచింది అంతా. కళ్లు నులుముకుని చూశాను. మాలి అక్కడే ఉన్నాడు. పిచ్చిది వెళ్ళిపోతోంది. చొక్కా చిరిగిపోయి ప్రత్యక్ష నిదర్శనంలా కనబడుతోంది. కల యితే ఇంకా పూర్తి కాలేదేమో! టైముకోసం గడి యారం చూశాను. పన్నెండు దగ్గర ఆగిపోయి ఉంది. పక్కకు తిరిగా.

అక్కడ ఒక క్షణం ఉండటం మంచిదిగాదని తోచింది. వెంకట్రావుతో చెప్పే అవకాశం లేదు. అదీ కాక ఈ దయ్యాలకొంపలో పడేసినవాడిని ఏమనాలి? వాడే ఉండగా లేనిది నన్ను ఆహ్వానించటంలో దోషం ఏముంది?

ఏది ఎలాగున్నా వాడితో చెప్పటం అనవసరం అను కున్నా. మెట్లు దిగి కిందకు వచ్చేశా. గడపల మీద ఇద్దరు కూర్చున్నారు. నన్ను చూసి పక్కకు తొలిగిపోయారు. సంపెంగి చెట్టు పక్కగుండా బయటకు దారి. ఆ ఒక్క పువ్వు పాలరాతి విగ్రహం తీసుకుపోయింది. విచారం కలి గింది. ఆమె మళ్లా ఒకసారి కనబడితే! ఆమెను ప్రేమిం చటం కష్టం. ఆరాధించటం సులభం. సంపంగి పువ్వు అడిగింది. ఆమె ఏది కోరినా ఇచ్చే వాణ్ణే. ఎందుకో జేబు తడిమి చూసుకున్నాను. సంపంగి పువ్వు జేబులోనే ఉంది. ఒళ్లంతా నీళ్లు కారిపోయింది. పరుగెత్తుకుంటూ వెళ్లాను. కొంత దూరం పరుగెత్తిన తర్వాత సిటీ బస్సు దొరికింది.

వెంకటరావు మర్నాడు సాయంత్రం బజారులో కన బడ్డాడు. ఎవరితోనో మాట్లాడుతున్నాడు. అతను తల ఊపుతున్నాడు అంగీకార సూచకంగా.

నాకు ఒళ్లు భగ్గున మండిపోయింది.

"రాత్రి చెప్పకుండా వచ్చేసేవేమిరా . !" అని అడి గాడు నా ముఖంమీద గుచ్చుకున్న పన్ను జ్ఞప్తికి వచ్చింది నాకు. చెయ్యితో తడిమి చూచుకున్నాను. మంటగా ఉంది.

"ఆ దెయ్యాల కొంపలో ఎట్లా ఉంటున్నావు... నన్ను రమ్మని ఎలా పిలిచావు..." అన్నా. అతను నవ్వాడు.

"ఉన్న దయ్యాలన్నీ మంచివేరా. అద్దె ఇవ్వవుగాని వాటితో వేరే పేచీ ఏమీ లేదు.. " అన్నాడు.

"అవునవును...నీకూ వాటికి చెలిమి కుదిరింది కాబోలు. రాత్రి ఆ పిచ్చిదాన్ని చంపేసి ఉందును.. " అన్నా.

"ఊయకున్నావేం .."

"మాలి అడ్డు వచ్చాడు . లేకపోతేనా. ?

"వెధవ ఉద్యోగం నువ్వూను. దయ్యాలను వెళ్ళ గొట్టటం చేతకాకపోతే వప్పుకోవచ్చు గాని...ఆ పిచ్చి దాన్ని బంగళాలోంచి వెళ్ళగొట్టించలేక పోయావు... ప్రత్యక్ష రాక్షసిలాగా ఉంది" అన్నాను. వెంకటరావు నవ్వితే నాకు ఒళ్లు మండిపోయింది.

"వెళ్ళగొట్టటం ఎట్లాగురా నా తండ్రీ...బంగళా దానిదేగా..." అన్నాడు.

నా నోట మాట రాలేదు. సంపెంగ పొదలో దాచు పాము కదిలిన చప్పుడయే ఆకుల చప్పుడులాగా సవ్వడి చేసింది నా గుండె. *

